పోషణ పక్షం



పౌష్టికాహారంపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

ముషీరాబాద్‌: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని బాపూజీనగర్ అంగన్‌వాడీ టీచర్ విమల అన్నారు. సోమవారం ఐసీడీఎస్ సికింద్రాబాద్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. పుట్టిన శిశువుకు తప్పనిసరిగా తల్లిపాలు పట్టించాలని సూచించారు. తల్లి పౌష్టికాహారం తీసుకుంటేనే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నప్రాసనలో అంగన్‌వాడీ టీచర్లు ఝాన్సీ, భాగ్యరేఖ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కాలేజీల అక్రమాలను అరికట్టండి



ఉస్మానియా యూనివర్సిటీ: ప్రవేటు, కార్పొరేట్ జూనియర్ కాలేజీల అక్రమాలను అరికట్టాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్‌ చేశారు. స నోటిఫికేషన్ ద్వారా ఆన్‌లైన్ అడ్మిషన్లు చేపట్టాలని, నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసులు చేస్తున్న కాలేజీల పై చర్యలు తీసుకోవాలని, అనుమతి లేని కాలేజీలను మూసివేయాలని, ముందస్తు తరగతుల నిర్వహణను అరికట్టాలని ఏబీవీపీ నేతలు డిమాండ్ చేశారు. తెలంగాణ ఇంటర్మీయోట్ విద్యా మండలి కార్యదర్శి కృష్ణ ఆదిత్యకు వినతి పత్రం సమర్పించిన్నట్లు ఏబీవీపీ నగర కార్యదర్శి పృథ్వీ తేజ తెలిపారు.

బానోతు నరేష్‌కు డాక్టరేట్

ఉస్మానియా యూనివర్సిటీ: గిరిజన విద్యార్థి బానోతు నరేష్‌కు ఓయూ ఫిజిక్స్ పీహెచ్‌డీ డాక్టరేట్ లభించింది. సైన్స్ కాలేజీ ఫిజిక్స్ అధ్యాపకులు ప్రొ.లక్ష్మణ్ నాయక్ పర్యవేక్షణలో ఆయన చేసిన పరిశోధనకు డాక్టర్ డిగ్రీ లభించిందని తెలిపారు. మహబుబాబాద్ జిల్లా మరిపెడ మండలం పర్కలజాల తండాకు చెందిన బానోతు నరేష్ తన పరిశోధన గ్రంథాన్ని గైడ్ ప్రొ.లక్ష్మన్ నాయక్ అందచేశారు.

కేన్సర్‌ను ముందుగా గుర్తిస్తే నివారించవచ్చు

గన్‌ఫౌండ్రీ: కేన్సర్ అనేది ఒక వైద్య సమస్య మాత్రమే కాదు జీవితలను మార్చివేసే ఒక యదార్థమని ద గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ చిన్నబాబు సుంకవల్లి అన్నారు. కేన్సర్‌ను ముందుగా గుర్తిస్తే చికిత్స చేయవచ్చని, పూర్తిగా కోలుకోవచ్చని తెలిపారు. సోమవారం అబిడ్స్‌లోని స్టాన్లీ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ద గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు వచ్చే కేన్సర్‌పై అవగాహన, పరీక్షల నిర్వహణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మహిళల్లో గర్భాశయ, స్థన, అండాశయ కేన్సర్‌లు సర్వసాధారనంగా వస్తుంటాయని సరైన సమయంలో పరీక్షలు చేయించుకుంటే నివారించవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 159 మంది మహిళలకు వైద్యులు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యప్రసాద్, కార్యదర్శి కృష్ణారావు, మేనేజిమెంట్ సభ్యులు ప్రదీప్‌రెడ్డి, రాకేష్ రెడ్డి, అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ ఎ.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.7 వేలు లంచం తీసుకున్న వ్యక్తి రిమాండ్

సిటీ కోర్టులు: ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ కాపీపై సంతకం పెట్టడానికి రూ.7 వేలు లంచం డిమాండ్ చేసిన సీనియర్ అసిస్టెంట్ ఆఫీసర్‌కి నాంపల్లిలోని ఏసీబీ కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఆర్మూర్‌లోని పంచాయతీరాజ్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎన్.శ్రీనివాస్‌శర్మ ఓ వ్యక్తికి సంబంధించిన ఫండ్ ట్రాన్స్‌ఫర్ పత్రాలపై మునుపటి ఈఈ, పీఆర్ ఆర్మూర్(ప్రస్తుత నిజామాబాద్) సంతకం పెట్టడానికి శ్రీనివాస్‌శర్మ అతని నుంచి రూ.7500 లంచం డిమాండ్ చేశాడు. దీంతో ఫిర్యాదుదారుడి అభ్యర్థన మేరకు రూ.7000 ఒప్పుకోగా ఏవో టేబుల్ మీద పెట్టాడు. సమాచారం అందుకున్న ఏసీబీ అధికారులు రూ.7 వేలు సీజ్ చేయడంతోపాటు నిందితుడు శ్రీనివాస్ శర్మను అరెస్ట్‌చేసి సోమవారం నాంపల్లిలోని ఏసీబీ కోర్టులో హాజరుపర్చారు. దీనిపై విచారణ చేపట్టిన 2వ అదనపు స్పెషల్ ఏసీబీ కోర్టు నిందితుడికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది.

నూతన ఇసుక విధానంతో ఆదివాసీలకు అన్యాయం

- గిరిజన సొసైటీలకే మైనింగ్‌పై అధికారం ఇవ్వాలి
- ఆదివాసీ నవ నిర్మాణ సేన డిమాండ్



ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ఆదివాసీ సంఘం నాయకుల ధర్నా

కవాడిగూడ: షెడ్యూల్డ్ ప్రాంతాలలో గిరిజన సొసైటీలకే మైనింగ్‌లపై అధికారం ఉంటుందని.. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన ఇసుక పాలసీతో ఆదివాసులకు తీరని అన్యాయం జరుగుతుందని ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షుడు కొర్స నరసింహమూర్తి అన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతంలోని నీళ్లు, నిధులను కార్పొరేట్ కంపెనీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యథేచ్ఛగా దోచిపెడుతున్నాయని ఆరోపించారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద ఏజెన్సీ ప్రాంత ఆదివాసీ నవనిర్మాణ సేనతో కలిసి ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాపారావు అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ఏజెన్సీ ప్రాంతం ములుగు జిల్లాలోని వెంకటాపురం, వాజేడు, మంగపేట, ఏటూరు నాగారం, కన్నాయిగూడెం మండలాలకు చెందిన ఇసుక సొసైటీల సభ్యులు పాల్గొన్నారు.

- ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నరసింహమూర్తి మాట్లాడుతూ.. ఐదో షెడ్యూల్డ్ ప్రాంతంలో ఉన్న గోదావరి నదిలోని ఇసుకను ప్రభుత్వ కారుచౌకగా కాజేస్తోందని విమర్శించారు. ప్రభుత్వం తీసుకురానున్న నూతన ఇసుక పాలసీ షెడ్యూల్ చట్టాలను కాలరాసి ఆదివాసులకు అన్యాయం చేసే విధంగా ఉందన్నారు. మైన్స్ అండ్ మినరల్స్ రెగ్యులేషన్ అండ్ డెవలప్‌మెంట్ చట్టంలోని సెక్షన్ 11(5) ప్రకారం ఐదో షెడ్యూల్ ప్రాంతాలలో ప్రభుత్వం మీద ఇతర వ్యక్తులు మైనింగ్ చేసే అధికారం లేదని గుర్తు చేశారు.
- షెడ్యూల్ ప్రాంతాల్లో గిరిజన సహకార సంఘాలకు మాత్రమే మైనింగ్ చేసే అధికారం ఉందన్నారు. కార్పొరేట్ కంపెనీలకు మైనింగ్ అనుమతులు ఇచ్చే విధంగా నూతన విధానాన్ని రూపొందించారని ఆయన పేర్కొన్నారు. నూతన ఇసుక పాలసీ విధానాన్ని ఏజెన్సీ ప్రాంతంలో అమలు చేయొద్దని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎస్.నాగరాజు, ఎమ్మార్పీఎస్ నాయకులు నందూరి నర్సింహ, గాదె వెంకట్ ఆదివాసీ నాయకులు అరుణ్‌కుమార్, వివేక్, సుభద్ర, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'కేంద్రం రైల్వే వ్యవస్థను బలహీన పరుస్తోంది'



సీఐటీయూ రాష్ట్ర కమిటీ సదస్సులో మాట్లాడుతున్న కె.హేమలత

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేశంలో రైల్వే ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోవాలని సీఐటీయూ జాతీయ అధ్యక్షులు కె. హేమలత అన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ... దేశంలో ఇటీవల కాలంలో వరుస రైల్వే ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ ప్రమాదాల్లో లోకో పైలెట్లు, రైల్వే మేనేజర్లు, రైల్వే ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు, వందలాది ప్రయాణికులు మరణిస్తున్నారని పేర్కొన్నారు. దీనికి కేంద్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించటం లేదని విమర్శించారు. కీలకమైన రైల్వే వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం బలహీన పరుస్తోందని అన్నారు. ప్రమాదాల నివారణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు, ప్రధాన కార్యదర్శి పాలడగు భాస్కర్, బి.మధు, వీఎస్ రావు, టి.వెంకట్‌రావు, అనంత్ కుమ్లె, జె.వెంకటేష్, జి. సాంబశివరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



బాలోత్సవం వేసవి శిక్షణ శిబిరం వర్క్‌షాపులో మాట్లాడుతున్న శాంతారావు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని బాలల వికాస నిపుణుడు కె.శాంతారావు అన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరంపై వర్క్ షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతారావు మాట్లాడుతూ... నేటి ఆధునిక కాలంలో పిల్లలు పెడదారిన పట్టకుండా తల్లిదండ్రులు తగిన విధంగా కృషి చేయాలన్నారు. బాలోత్సవ అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పిల్లలలో విజ్ఞానం, వినోదంతో పాటు మానవీయ విలువలను నేర్పిస్తామన్నారు. పిల్లల అభిరుచులకు అనుగుణంగా ఆటపాటలు, డ్యాన్స్‌లు, ఇండోర్‌గేమ్స్ తదితర అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవ కార్యదర్శి ఎస్.సోమయ్య, బుచ్చిరెడ్డి, నాగకృష్ణ, మారన్న తదితరులు పాల్గొన్నారు.

వాహనదారుల భద్రతే మొదటి ప్రాధాన్యం

ట్రాఫిక్ అదనపు డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి



సనత్‌నగర్: వాహనదారుల భద్రతే తమ మొదటి ప్రాధాన్యత అని, సురక్షిత ప్రయాణం మెరుగైన జీవితానికి దారితీస్తుందని నార్త్‌జోన్ ట్రాఫిక్ అదనపు డిప్యూటీ కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. నగర ట్రాఫిక్ జాయింట్ పోలీస్ కమిషనర్ జోయెల్ డేవిస్, డీసీపీ రాహుల్ హెగ్డె సూచనల మేరకు బేగంపేటలోని ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్‌లో 'రోడ్డు ప్రమాదాలు–నివారణ' అనే అంశంపై సోమవారం పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి దాదాపు 170 మంది వ్యక్తులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి కౌన్సెలింగ్ సెషన్‌లో పాల్గొన్నారు. దీనికి హాజరైన వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ మైనర్ డ్రైవింగ్ కేసుల్లో తల్లిదండ్రులు లేదా సంరక్షకులు బాధ్యత వహిస్తారన్నారు. ఆ కేసుల్లో వాహనం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ సస్పెండ్ చేయబడే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ నాగుల అశోక్ పాల్గొన్నారు.

ఓయూలో కాంట్రాక్టు అధ్యాపకుల అరెస్ట్



నిరవధిక సమ్మెలో ఓయూ కాంట్రాక్టు అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉద్యోగాలను పర్మనెంట్ చేయాలని నిరవధిక సమ్మె చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం పాలనా భవనం ఎదుట బైఠాయించి వివిధ రకాల నినాదాలతో సమ్మె చేస్తున్న అధ్యాపకులను పోలీసులు అడ్డుకున్నారు. సమ్మెను విరమించాలని పోలీసులు కోరినా అధ్యాపకులు కొనసాగించారు. దీంతో పోలీసులు కాంట్రాక్టు అధ్యాపకుల జేఏసీ నాయకులు డా.వేల్పుల కుమార్, డా.మహేశ్వర్ రెడ్డి, డా.ఉపేందర్, సీమర్ల విజేందర్ రెడ్డి, డా.తాళ్లపల్లి వెంకటేశం, డా.కృష్ణయ్య, డా.కవితషిండే , డా.రేష్మారెడ్డి, డా.నస్రీన్ సుల్తాన, డా. చెన్నగౌడ్, డా.సనత్, డా.కృష్ణవేణి, డా.జయశ్రీ,డా.ప్రసాద్ తదితరులతో పాటు మందిని అరెస్ట్ చేసి ఓయూ పీఎస్‌కు తరలించారు.

ఓయూ వీసీ పక్షపాత ధోరణి

ఓయూ వీసీ ప్రొ.కుమార్ కాంట్రాక్టు అధ్యాపకుల పట్ల పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని జేఏసీ నాయకుడు డా.ఉపేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఉద్యోగాల పర్మనెంట్ సానుకూలంగా ఉన్నా వీసీలు వ్యతిరేకిస్తున్నారని ఆరోపించారు. పర్మనెంట్ అధ్యాపకులు ఉద్యోగ విరమణ వయస్సు 60 నుంచి 65 సంవత్సరాలకు పెంపు, పీఆర్‌సీ అమలు, పాత పింఛన్ విధానం కోసం పోరాడి సాధించుకున్నారని కాంట్రాక్టు అధ్యాపకుల హక్కుల కోసం ఆందోళన చేస్తుంటే అరెస్టు చేయిస్తున్నారని వీసీ కుమార్ పై ధ్వజమెత్తారు.

నల్లా కనెక్షన్లకు మోటార్లు బిగిస్తే చర్యలు తప్పవు

సికింద్రాబాద్‌: తాగునీటి నల్లా కనెక్షన్ దారులు మోటార్లను బిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జలమండలి తార్నాక డీజీఎం ఎస్ఎల్ సరిత హెచ్చరించారు. సోమవారం మెట్టుగూడ ఆలుగడ్డబావి ప్రాంతంలో వ్యక్తిగత నల్లా కనెక్షన్‌దారుల గృహాల్లో తనిఖీలు నిర్వహించారు. నల్లాకనెక్షన్లకు బిగించిన 11 విద్యుత్ మోటార్లు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. అనంతరం డీజీఎం సరిత మాట్లాడుతూ అక్రమ నల్లాకనెక్షన్ కలిగిఉన్న వారిపై, విద్యుత్‌మోటార్లు బిగించిన వారిపై కేసులు నమోదు చేయడంతోపాటు, జరిమానాలు విధిస్తామని చెప్పారు.

26న ఓయూ ఫౌండేషన్ డే

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఫౌండేషన్ డేను ఈ నెల 26న నిర్వహించనున్నారు. నిజాం పాలనలో 1917లో స్థాపించిన ఓయూ 108 ఏండ్లు ముగించుకొని 109వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఫౌండేషన్ డేను క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో అధికారికంగా జరపనున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఓయూ పూర్వవిద్యార్థి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కేశవరావు హాజరుకానున్నట్లు సమాచారం.

24న జానకి సినీ గీతాలాపన

గన్‌ఫౌండ్రీ: రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శృతిలయ ఫౌండేషన్, సీల్‌వెల్ కార్పొరేషన్, ఆదర్శ ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 24న రవీంద్రభారతిలో సినీ నేపథ్య గాయని ఎస్.జానకి జన్మదిన వేడుకలు నిర్వహించనున్నట్లు శృతిలయ వ్యవస్థాపక కార్యదర్శి ఆమని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జన్మదిన వేడుకల్లో భాగంగా ఎస్.జానకి సినీ గీతాలాపన కూడా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి, సీల్‌వెల్ కార్పొరేషన్ సీఎండీ, బండారు సుబ్బారావుతో పాటు పలువురు ప్రముఖులు హాజరు కానున్నట్లు తెలిపారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సరాన్ని పురస్కరించుకొని వివిధ రంగాల్లో సేవలందిస్తున్నవారికి ఉగాది విశిష్ట పురస్కారాలను సైతం ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు.

పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సత్కళాభారతి ఆధ్వర్యంలో న్యాయవాది ఎస్.కిషన్‌రావు రచించిన 'కవనం నా ఊపిరి'అనే పుస్తకావిష్కరణ సభ సోమవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ..న్యాయవాద వృత్తిలో ఉంటూ రచయితగా కొనసాగడం ఎంతో అభినందనీయమన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్ నిత్యానందరావు, సాహితీవేత్తలు ఆచార్య ఎస్వీ రామారావు, ఓలేటి పార్వతీశం, విజయరామారావు, సంస్థ అధ్యక్షులు సత్కళాభారతి సత్యనారాయణ పాల్గొన్నారు.

యువ టేబుల్ టెన్నిస్ క్రీడాకారులను ప్రోత్సహిస్తాం

గన్‌ఫౌండ్రీ: యువ టేబుల్ టెన్నిస్ క్రీడాకారులను ప్రోత్సహిస్తామని తెలంగాణ రాష్ట్ర టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ తెలిపింది. సోమవారం తెలంగాణ రాష్ట్ర టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో టేబుల్ టెన్నిస్‌లో జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను సత్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.నాగేందర్‌రెడ్డి మాట్లాడుతూ..యువ క్రీడాకారులు ఎప్పటికప్పుడు సీనియర్ క్రీడాకారుల సలహాలు, సూచనలు తీసుకోవాలని వారి నుంచి స్ఫూర్తిని పొందాలని సూచించారు. పారా, క్రీడాకారులకు కూడా మంచి అవకాశాలు ఉంటాయని తెలిపారు. క్రీడాకారులతో పాటు కోచ్‌లను కూడా గుర్తించి వారికి తగు సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



అమెరికాతో భారత్ అసమాన ఒప్పందాలు ఆపాలి



సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కిసాన్ మోర్చా నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వ్యవసాయం, పాడి పరిశ్రమ, చేపలు పట్టడంలో అమెరికాతో భారత దేశం అసమాన ఒప్పందాలు ఆపాలని లేకుంటే దేశ వ్యాప్తంగా సమరశీల పోరాటాలను నిర్వహిస్తామని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ టి.సాగర్ అన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భారత పర్యటనను వ్యతరేకిస్తూ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ.. ఆస్ట్రేలియాతో కుదిరిన ఒప్పందం ప్రకారం నిర్దిష్ట పరిమాణంతో కందులు, శెనగపప్పు దిగుమతులపై జీరో డ్యూటీ భారతదేశం సంసిద్ధత వ్యక్తం చేసిందన్నారు. అమెరికన్ రైతులకు భారీ సబ్సిడీ ఇస్తూ మన దేశంతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం అంటే అసమానంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జక్కుల వెంకటయ్య, ప్రభులింగం, నాగిరెడ్డి, కాంతయ్య, సత్యనారాయణ, శోభన్ నాయక్, అరిబండి ప్రసాద్‌రావు, ఆనగంటి వెంకటేష్, కోటా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హమాలీ బస్తీవాసులకు ఇళ్లు కేటాయించండి



జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న లష్కర్ జిల్లా సాధన సమితి ప్రతినిధులు

సికింద్రాబాద్‌: సీతాఫల్‌మండి డివిజన్ హమాలీ బస్తీలో డిగ్నిటీ హౌజింగ్ స్కీంలో నిర్మించిన 65 గృహాలను లబ్ధిదారులకు అందజేయాలని లష్కర్ జిల్లా సాధనసమితి ప్రధాన కార్యదర్శి సాదం బాల్‌రాజ్‌యాదవ్ కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిసిన లష్కర్ సాధన సమితి ప్రతినిధులు, హౌజింగ్ స్కీం లబ్ధిదారులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బాల్‌రాజ్‌యాదవ్ మాట్లాడుతూ సంవత్సరాల క్రితం ప్రభుత్వం సికింద్రాబాద్ హమాలీబస్తీలో డిగ్నిటీ హౌజింగ్‌స్కీం ద్వారా గృహసముదాయాలు నిర్మించిందని చెప్పారు. ఇందులో సాంకేతిక ఆకరణాలు చూపిన అధికారులు 65 మంది లబ్ధిదారులకు గృహాలు అందించలేదు. ఏళ్ల తరబడి ఇండ్లను లబ్ధిదారులకు అందించకపోవడంతో లబ్ధిదారులకు అద్దెల భారం తప్పడంలేదని, నిర్మాణం పూర్తయిన గృహాలు నిరుపయోగంగా ఉంటుండడంతో శిథిలావస్థకు చేరుతున్న విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తెచ్చామన్నారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడి 15 రోజులలోగా లబ్ధిదారులకు ఇండ్లు అందజేస్తామన్ హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో లష్కర్ జిల్లా సాధన సమితి సభ్యులు శైలందర్, శ్రీకాంత్ రెడ్డి, అజీజ్, హమాలిబస్తీ హౌజింగ్ స్కీం ప్రతినిధులు అంజయ్య, జమున, రవి కుమార్, నర్సింగ రావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



ఉద్యమకారుల ప్లీనరీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

సికింద్రాబాద్‌: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరిచిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ప్లీనరీ సమావేశం సోమవారం సీతాఫల్‌మండిలోని మల్టీపర్పస్ ఫంక్షన్‌హాలులో నిర్వహించారు. ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్లీనరీ సమావేశానికి ఎమ్మెల్సీలు కోదండరాం, అద్దంకి దయాకర్, మాజీ ఎంపీ వీ.హన్మంతరావు, మాజీ ఎమ్మెల్సీ ఎల్.రమణ ఎంబీసీ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్లు సామల హేమ, లింగాని ప్రసన్నలక్ష్మి అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఉద్యమకాలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయించేందుకు అండగా నిలుస్తామని ప్రకటించారు. పలువురు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ప్రతినిధులు మాట్లాడుతూ కాంగ్రెస్ మెనిఫెస్టోలో రూపొందించిన విధంగా ఉద్యమకారులకు ఇండ్ల స్థలాలు, పెన్షన్‌లను జూన్ 2వ తేదీలోగా అమలులోకి తేవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలకు విస్తృతం చేస్తామన్నారు. ప్లీనరీ సమావేశంలో ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర నాయకులు మల్లారి అనిల్, గగన్‌కుమార్, జానకిరెడ్డి, దయానంద్, పుట్నాల కృష్ణ, జగన్, వీర స్వామి పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ హయాం నుంచే మహిళా రిజర్వేషన్ల పోరాటం



బీసీ మహిళా సంఘం జేఏసీ సమావేశంలో వీహెచ్, మధుసూదనాచారి

నల్లకుంట: ఇందిరా గాంధీ, రాహుల్ గాంధీ హయాం నుంచే మహిళల రిజర్వేషన్ల పోరాటాలు వస్తున్నాయని మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు(వీహెచ్) పేర్కొన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బీసీ మహిళా సంఘం జేఏసీ చైర్మన్ మట్ట జయంతి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం కాచిగూడలోని ఓ హోటల్‌లో బీసీ మహిళా సంఘం జేఏసీ సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన వీహెచ్ మాట్లాడారు. 50 శాతం రిజర్వేషన్లలో మహిళలకు 33 శాతం సబ్ కోటా ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళలు ఐక్యంగా ఉంటేనే రిజర్వేషన్ల అమలు సాధ్యం అవుతుందని పేర్కొన్నారు. మహిళలంతా కలిసి ఢిల్లీలో ఎప్పుడైతే ధర్నాలు చేపడతారో అప్పుడే అమలుకు నోచుకుంటాయని చెప్పారు. శాసన మండలి మాజీ చైర్మన్ మధుసూదనాచారి మాట్లాడుతూ.. మహిళలు ఐక్యంగా ఉద్యమిస్తేనే మహిళా రిజర్వేషన్ల అమలు సాధ్యం అవుతుందని చెప్పారు.

న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలుచేయాలి



సిటీ కోర్టులు: న్యాయవాదులకు అండగా రక్షణ చట్టాన్ని అమలు చేయాలని అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని న్యాయవాదులు కోరారు. తన వ్యక్తిగత కేసులో సోమవారం నాంపల్లి క్రిమినల్ కోర్టుకు వచ్చిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి నాంపల్లి కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. న్యాయవాదులు తమ విధులకు నిర్వర్తించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతి పత్రంలో కోరారు. కొన్నేళ్లుగా న్యాయవాదులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, బెదిరింపులు చూస్తుంటే ఎప్పుడు ఏ న్యాయవాదిపై దాడి జరుగుతుందోనని భయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాంపల్లి క్రిమినల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవికిషోర్, ఉపాధ్యక్షులు చంద్రమోహన్, రవీందర్, జనరల్ సెక్రటరీ ఎన్వీ రమణ, కోశాధికారి రవీందర్ నాయక్, జాయింట్ సెక్రటరీ హృదయనాత్ అసూర్య, సభ్యులు స్రవంతి, శ్రీలత, ప్రణీత్‌సింగ్ పవార్, న్యాయవాదులు పాల్గొన్నారు.